పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనాలకు స్పందన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేశారు. సిఐ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో అవుట్ పోస్టును ప్రారంభించారు. 'ప్రజాశక్తి'లో ఇటీవల ఏరియా ఆసుపత్రి భద్రత, పోలీస్ అవుట్ పోస్టు అవసరంపై వరుస కథనాలు వచ్చాయి. ఆ మేరకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి ఆస్పత్రిలో అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ఎట్టకేలకు మంగళవారం అవుట్ పోస్టును ప్రారంభించడంతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. టూ టౌన్ నుంచి ఒకరు, వన్ టౌన్ నుంచి ఒకరు రొటేషన్ పద్ధతిలో అవుట్ పోస్టు నందు విధులు నిర్వర్తిస్తారు.

టిటిడి డయల్ యువర్ ఈవోకు 'మంగళం'..?

భక్తులకు సమాధానం చెప్పలేకేనా..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో సమాచార హక్కు చట్టం లేదని చెప్పేస్తారు.. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు, చర్యలు.. టిటిడి తప్పిదాలను మీడియా ఎత్తిచూపితే ఖండనలు, హెచ్చరికలు.. భక్తులు తమ బాధలు చెప్పుకునేందుకు ఉన్న ఏకైక వేదిక'డయల్ యువర్ ఈవో'. ఈ కార్యక్రమం గతంలో రెగ్యులర్‌గా జరిగేది. ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసేది.. అయితే తాజాగా ఈ కార్యక్రమానికి టిటిడిలో మంగళం పాడేశారు.. భక్తులు అడిగే ప్రశ్నలకు టిటిడి ముఖ్య కార్యనిర్వహణాధికారి సమాధానం చెప్పుకోలేకనే దాదాపు ఎనిమిది నెలలుగా ఈ కార్యక్రమానికి స్వస్తి పలికారు. ఈ ఎనిమిది నెలల కాలంలో మే నెలలో ఒకసారి మాత్రం నిర్వహించారు.

భక్తులు నేరుగా టిటిడి ఈవోతో మాట్లాడేందుకు ప్రతినెలా మొదటి శుక్రవారం 'డయల్ యువర్ ఈవో' నిర్వహించేవారు. 2001, ఫిబ్రవరి 2న అప్పటి కార్యనిర్వహణాధికారి పి.క్రిష్ణయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటినుంచి నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని ఆ తరువాతి ఈవోలు సైతం కొనసాగించారు. ముఖ్యంగా భక్తులు తిరుమలలో భద్రత, సౌకర్యాలు, నిత్యాన్నదానంలో కష్టాలు, మౌలిక వసతులు, కల్యాణకట్టలో సమస్యలు, క్యూలైన్లలో అన్నప్రసాదాలు, పాలు తదితరాలు ఏర్పాటు చేయాలని ఈవోను ఫోన్ ద్వారా కోరేవారు. ఇందుకు ఈవో అందుకు అనుగుణంగా సమాధానాలను ఇచ్చేవారు. భక్తుల కోరిక మేరకు అవకాశాలు ఉన్నంత వరకూ వారి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకునేవారు. భక్తులు ఇచ్చే సూచనలు కొన్ని టిటిడి అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పవచ్చు.

జనవరి 8న వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీ సందర్భంగా తొక్కిసలాట ఘటన దగ్గర నుంచి టిటిడిపైన భక్తులు గుర్రుమన్నారు. ఆరుగురు భక్తులు దుర్మరణం టిటిడి వైఫల్యమేనని మండిపడ్డారు. అంతేగాకుండా టిటిడి ఉన్నతాధికారుల మధ్య సమన్వయ ఉందన్న ఆరోపణల నేపథ్యంలో భక్తులు అడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని పరిస్థితి. ఈ ఏడాదిలో మే నెలలో మాత్రమే డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమానికి మంగళం పాడినట్లే.

కాళ్లు చేతులు ఆడట్లేదు..!

'భరోసా' కోల్పోయిన వికలాంగులు
శాశ్వత వికలాంగుల్లోనూ పర్సంటేజి మార్పు
'పొలిటికల్ హైడ్రామా' అంటూ లబోదిబో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరుదాటాక బోడి మల్లన్న'.. అన్న చందంగా ఉంది సామాజిక పింఛన్ల సర్వే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా ఒకటో తేదీనే తాము పింఛన్లు అందజేస్తున్నామని ప్రగల్భాలు పలికారు. అయితే అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తరువాత సర్వే పేరుతో వికలాంగుల పింఛన్ల తొలగింపుకు శ్రీకారం చుట్టారు.. పరిశీలన కోసం అంటూ రమ్మని చెప్పి, తీరా ఇపుడు చేతిలో నోటీసులు పెట్టారు.. శాశ్వత వికలాంగులుగా ఉన్న వారి పర్సంటేజి సైతం వైసిపి హయాంలోనూ, కూటమి ప్రభుత్వంలోనూ 'సదరం' సర్టిఫికెట్లలో ఎలా మారిపోతుందని బాధితులు లబోదిబోమంటున్నారు. ఇదంతా పొలిటికల్ హైడ్రామా అని మండిపడుతున్నారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా 30వేల పైనే వికలాంగులకు పింఛన్ల అందజేతలో సెప్టెంబర్ నుంచి కోత పెడుతున్నట్లు నోటీసుల్లో పేర్కొనడం గమనార్హం. గత 20 ఏళ్లుగా వికలాంగ పెన్షన్ తీసుకుంటున్న వారికి సైతం 'అనర్హులుగా' కూటమి సర్వేలో పేర్కొన్నారన్నది వారి ఆవేదన

అలా రమ్మని..ఇలా నోటీసులిచ్చారు!

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పొందుతున్న ప్రతి ఒక్కరిని గత నెలలో సంబంధిత సదరం క్యాంపులకు వెరిఫికేషన్ నిమిత్తం రమ్మన్నారు. ముఖ్యంగా వికలత్వ ధ్రువీకరణే లక్ష్యంగా ఈ క్యాంపులు జరిగాయి. వికలత్వ పెన్షన్లు తీసుకుంటున్న అత్యధికుల్లో అనర్హులున్నారనేది ప్రభుత్వ వాదన. ఈ క్రమంలోనే గత నెలలో వెరిఫికేషన్ అని పిలిచి ఆగస్టు నెలలో మీ పెన్షన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు పంపించారని వికలాంగులు వాపోతున్నారు. ఈ ప్రక్రియ కారణంగా గత 20 ఏళ్లుగా వికలత్వ పెన్షన్లు తీసుకుంటున్న నిజమైన అర్హులు సైతం సెప్టెంబర్ నెలలో పెన్షన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇన్నేళ్లుగా శాశ్వత వికలత్వం కింద పెన్షన్ పొందుతున్న తాము ఇటీవల జరిపిన వెరిఫికేషన్ లో వికలత్వాన్ని ఎలా కోల్పోతామని ప్రశ్నిస్తున్నారు. అనర్హుల పేరిట అర్హులకు సైతం పెన్షన్ ఎగ్గొట్టడానికే ఇదంతా అంటూ విమర్శిస్తున్నారు.

శాశ్వత వికలత్వం ఉన్నా విస్మరించారు: బాధితుడు, తొట్టంబేడు మండలం

పక్షవాతం వచ్చి కాలూ, చేయి పని చేయడం లేదు. సదరం శిబిరంలో శాశ్వత వికలత్వం ఉందని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. 2022 నుంచి వికలత్వ పెన్షన్ తీసుకుంటున్నా. ఉన్నట్టుండి సెప్టెంబర్ నెలకు పెన్షన్ రాదని చెప్తున్నారు. ఏరియా ఆసుపత్రికి వెరిఫికేషన్ కి రమ్మన్నారు. అక్కడి నుంచి తిరుపతికి పొమ్మంటున్నారు. నడవలేని స్థితిలో వికలాంగులకు ఈ దుర్భరపరిస్థితులేంటి.

అర్హులు ఆందోళన పడొద్దు: భాను ప్రకాష్ రెడ్డి ఆర్డీవో

గత నెలలో జరిగిన వెరిఫికేషన్ ప్రక్రియలో చాలామంది అనర్హులుగా గుర్తించబడ్డారు. వైద్యాధికారులిచ్చిన వికలత్వ పర్సంటేజీల (40 శాతం కన్నా తక్కువ) ఆధారంగానే పెన్షన్లను నిలిపి వేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నిజమైన అర్హులుగా ఉండీ, నోటీసులు అందుకున్న వికలాంగులకు అప్పీలు చేసుకునే అవకాశం ఇస్తున్నాం. ఆందోళన పడకుండా తిరుపతి సదరం క్యాంపులో వికలత్వ ధ్రువీకరణ పత్రాలు తీసుకొస్తే పెన్షన్లు పునరుద్ధరిస్తాం.

పెన్షన్ యధావిధిగా పునరుద్ధరించాలి :వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

జిల్లాలో 30వేల వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. వెంటనే రద్దు చేసిన పెన్షన్లను యధావిధిగా పునరుద్ధరించాలి. తాము పాలనలోకి వస్తే మెరుగైన పెన్షన్ అందిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుకు భిన్నంగా అత్యంత నిరాదరణకు గురైన వికలాంగుల పెన్షన్ మీద ఇటువంటి చర్యలు తీసుకోవడం వారిని ఇబ్బందిపెట్టడమే. ఇప్పటికే సమాజంలో అనేక అవమానాలను, చీదరింపులకు గురవుతున్న వికలాంగులను ఈ విధంగా ప్రభుత్వం చూడటం సరైనది కాదు. గత పదేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న వారిని సైతం వైకల్య శాతం తక్కువగా ఉందని కారణం చూపి పెన్షన్ నిలిపేయడం సరికాదన్నారు. ప్రభుత్వం రద్దుచేసిన పెన్షన్లను పునరుద్ధరించని పక్షంలో, లబ్దిదారులు చేసే పోరాటాలకు సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొని అండగా ఉంటుంది.

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో...

వైసిపి ఇన్‌ఛార్జిగా హరికృష్ణ..?

'స్వామి'ని పక్కనపెట్టిన జగన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో లేని, ఆరోపణలు ఉన్న నాయకులను పక్కన పెట్టేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు కంచుకోట. 35 ఏళ్లుగా అప్పట్లో కాంగ్రెస్, ఆ తరువాత వైసిపి అభ్యర్థులు ఎంఎల్‌ఎలుగా గెలుపొందుతూ వచ్చారు. అంతటి ఆదరణ ఉన్న ఆ నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి గత పదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఎంఎల్‌ఎగానూ గెలిచి డిప్యూటీ సిఎంగానూ పదేళ్లు కొనసాగారు. అయితే కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేయకపోగా వారి మధ్యలో గ్రూపులుగా విభజించి చిచ్చుపెట్టి వేడుక చూశారన్నది ఆ నియోజకవర్గంలో ద్వితీయశ్రేణి నాయకుల ఆరోపణ.

మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి సైతం 2024 ఎన్నికల్లో నారాయణస్వామికే కాదు, ఆ కుటుంబంలో ఎవరికి సీటు ఇచ్చినా పార్టీ ఓటమి పాలవుతుందని జగన్మోహన్‌రెడ్డికి ముందస్తుగా చెప్పారు. అయినా జగన్మోహన్‌రెడ్డి నారాయణస్వామిపై ఉన్న నమ్మకంతో ఆ కుటుంబంలోనే సీటు ఇచ్చారు. కుమార్తె కళత్తూరు కృపాలక్ష్మి సీటు దక్కించుకుని పోటీ పడ్డారు. అయితే టిడిపి అభ్యర్థి థామస్ చేతిలో 28వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటినుంచి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా ఆమె కొనసాగుతూ వచ్చారు. పార్టీ అధికారం కోల్పోవడంతో వృత్తిరీత్యా డాక్టర్‌గా ఉన్న ఆమె విజయవాడలో తిరిగి సెటిలయ్యారు. చుట్టంచూపుగా నియోజకవర్గానికి రావడం తప్ప, టిడిపి నుంచి కార్యకర్తలకు ఎదురయ్యే వివాదాలను, సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. దీంతో నాలుగేళ్లపాటు టిడిపిని ఎదుర్కోలేక ఏడాదిన్నర పాటు తటస్థంగానే నారాయణస్వామి కుటుంబం ఉంటూ వచ్చింది. వెదురుకుప్పం, పెనుమూరు, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాలను స్థానికుడైన చిత్తూరు అసెంబ్లీకి పోటీచేసి ఓటమి పాలైన విజయనాందరెడ్డి జగన్‌కు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ వచ్చారు. దీంతో రాబోయే 'స్థానిక, పంచాయతీ' ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ కూటమిని ఎదుర్కోవాలంటే ఇన్‌ఛార్జిని మార్పు చేయక తప్పదని జగన్మోహన్‌రెడ్డి భావించినట్లు విశ్వసనీయ సమాచారం. నారాయణస్వామి కుటుంబాన్ని పక్కన పెట్టి, త్వరలోనే నియోజకవర్గంలో పట్టున్న మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణకు పగ్గాలు ఇస్తారని చర్చ నడుస్తోంది.

ఏర్పేడులో 'కిరితారా' రిసార్ట్స్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏర్పేడు సమీపంలో ఐఐటికి అతి చేరువలో 80 కోట్ల రూపాయల వ్యయంతో 'కిరితారా' రిసార్ట్స్ నిర్మించేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామని, ఈ మేరకు సెప్టెంబర్ 1న అవగాహనా ఒప్పందం సిఎం చంద్రబాబునాయుడు సమక్షంలో జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మెస్సర్స్ కిరితార రిసార్ట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ వి.సత్యనారాయణ, ఆర్కిటెక్ జి.గంగరాజు, టూరిజం రీజినల్ డైరెక్టర్‌రమణప్రసాద్‌లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏర్పేడు సమీపంలో ఐఐటికి అతి చేరువలో 80 కోట్ల రూపాయల వ్యయంతో 500 మందికి ఉపాధి కల్పించేలా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని కలెక్టర్ వివరించారు. ఈనెల ఒకటో తేదీన గండికోట వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందం సిఎం సమక్షంలో జరుగుతుందన్నారు. రిసార్ట్‌నందు ఆసియాలోనే అతి పెద్దదైన స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేస్తున్నారని, అలాగే లగ్జరీ సూట్స్, హిల్‌వ్యూ విల్లాలు, క్లబ్‌హౌస్ ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఆడుకునేలా రిసార్ట్స్‌ను రూపొందిస్తున్నారన్నారు. తిరుపతి జిల్లాలో ఈ రిసార్ట్‌సను త్వరితగతిన నిర్మించి, జిల్లా ప్రజలతో పాటు, పర్యాటకులకు సైతం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి ఎం.జనార్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు కె.సుబ్బరాయుడు, ఈ.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు నీటి నిల్వలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి నిల్వలు సమద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో అదనపు ఈవో తిరుమల, తిరుపతి ప్రాంతాలలోని అన్ని డ్యాములలో నీటి లభ్యత, వినియోగంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలలోని డ్యాముల దఢత్వంపై సమగ్ర నివేదిక అందించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత నీటి నిల్వలు 2025 డిసెంబర్ వరకు భక్తుల అవసరాలకు సరిపోతాయన్నారు. రాబోయే కార్తీక మాసంలో వర్షపాతం ఆధారంగా భవిష్యత్ అవసరాలకు సరిపడే విధంగా నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. తిరుమలలో గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ లలో ప్రస్తుతం భక్తుల అవసరాలకు తగిన నీటి నిల్వలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలన్నారు. గత 5 నుండి 10 సంవత్సరాల వరకు నీటి లభ్యత, వర్షపాతం, వినియోగం, వథా విడుదలపై నిపుణులచే సమగ్ర ఆడిట్ నిర్వహించాలన్నారు. నీటిని ప్రణాళికబద్ధంగా వినియోగించుకుంటే, నిరంతర సరఫరా సాధ్యమని చెప్పారు. తిరుమలలోని వాణిజ్య సంస్థల నీటి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వాటర్ వర్క్స్ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లను కొనసాగించాలి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్లను కొనసాగించాలని, వైసిపి ముద్ర వేసి తొలగించడం అన్యాయమని విద్యార్థిసంఘాలు నిరసన తెలిపాయి. తరగతులు జూన్ నెలలో ప్రారంభమైతే ఆగస్టు నెల పూర్తి అయ్యే సందర్భంలో కొంతమంది వైసీపీ పార్టీకి అనుకూలంగా ఉన్నారని తప్పుడు సమాచారంతో, బోధనలో ఎంతో అనుభవం ఉన్న, ప్రత్యేక మెరిట్ ఉన్న అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించడం బాధాకరమని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో తొలగించిన అకడమిక్ కన్సల్టెంట్ లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు వినోద్, అశోక్, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం నేతలు ప్రేమ్ కుమార్ తదితరులు తొలగించిన ఒప్పంద అధ్యాపకులకు మద్దతుగా పరిపాలన భవనం దగ్గర మంగళవారం ధర్నా నిర్వహించారు. అకడమిక్ కన్సల్టెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్ఫామెన్స్ చేయాలని సూచించకనే, వర్సిటీ ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో వర్సిటీలో ఒప్పంద అధ్యాపకుల తొలగింపు చర్యలకు రాజకీయాలకు ముడిపెడుతూ ప్రత్యేకంగా కొంతమంది మెరిట్ ఉన్న అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించడం బాధాకరమని ఆక్రోశించారు. తొలగించిన వారిలో ఒకే రెడ్డి వర్గానికి సామాజిక వర్గానికి చెందినవారు, ఎస్ టి, ఎస్ సి బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుందని, దీనిబట్టి చూస్తే యుజిసి నెట్, ఏపీ సెట్ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి బోధనలో 8 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్నటువంటి వారిని తొలగించడం వర్సిటీ మేధావులని, పరిశోధకులను ఆలోచింపచేస్తుందన్నారు. వెంటనే తొలగించిన అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకులు ప్రవీణ్, కుమార్ రాజా, శివశంకర్ రాయల్, మాధవరెడ్డి, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్స్ యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న కందారపు మురళి

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆటోకార్మికుల పట్ల ప్రభుత్వ తీరు మారాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ జిల్లా రెండో మహాసభ అధ్యక్షులు బివి రమణయ్య అధ్యక్షతన వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో ఆటో కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులతో కూడిన ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని, ప్రమాదబీమా, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, పోలీసుల వేధింపులు లేకుండా చూడాలన్నారు. 13 లక్షలమంది ఆటో కార్మికులకు 'వాహనమిత్ర' అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి నిబంధనలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, సబ్సిడీలో ఎలక్ట్రానిక్ ఆటోలు అందజేయాలని డిమాండ్‌చేశారు. ఆటోస్టాండ్‌లోనే చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికుల సంపాదనను ప్రైవేట్ కంపెనీ యాప్‌లు ఓల, ఊబర్, రాపిడో కొల్లగొడుతున్నాయన్నారు. కొత్త బి.ఎన్.ఎస్ చట్టంలోని 106 (1),(2) లను రద్దు చేయాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ఆటో యూనియన్ నాయకులు నాయకులు తంజావూరు మురళి, కే లక్ష్మయ్య, వై కుమార్, బాదుల్లా, వాసు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, నగర అధ్యక్షులు టి సుబ్రమణ్యం, నగర ప్రధాన కార్యదర్శి ఎం మాధవ్, పి మునిరాజా, ఎస్ ముకుంద పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట

తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకష్ణ నాయక్ ఆదేశాల మేరకు రేణిగుంట మండల వైద్యాధికారి చక్రపాణి ఆధ్వర్యంలో శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. 5-7 ఏళ్ల మధ్య గల వారికి ఇచ్చే రెండో డిపిటి బూస్టర్ డోసులు, 10-16 మధ్య ఇచ్చే టిడి అదనపు డోసుల ప్రత్యేక వ్యాక్సినేషన్‌పై వివరించారు. ప్రతి ఒక్కరూ వందశాతం వ్యాక్సిన్ వేయించుకునేలా చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు పేర్కొన్నారు. ఈ వాక్సినేషన్ వలన విద్యార్థులకు మంచి ఆరోగ్యంతో పాటు డిఫ్తీరియా (కంఠసర్పి), పర్టుసిస్ (కోరింతదగ్గు), టెటనస్(ధనుర్వాతం)వంటి వ్యాధులపై వ్యాధినిరోధక శక్తి లభిస్తుందని, ఎటువంటి అనారోగ్యం, ప్రాణనష్టం గాని జరగదని హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు. కరస్పాండెంట్ మొహ్మద్ అరీఫ్, ఎఎన్ఎం విజయలక్ష్మి, ఎమ్ఎల్హెచ్పీ పద్మ, ఆశాకార్యకర్త విజయ పాల్గొన్నారు.

సింహాచలకండ్రిగలో మొక్కలు నాటుతాం

అటవీ భూములను అడ్డుకుంటే 'లక్ష' జరిమానా
వర్సిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగుపడాలి
మీడియాతో డిఎఫ్ఒ వివేక్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ వద్ద దాదాపు 100 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందని, 144 సెక్షన్ విధించైనా మొక్కలు నాటి తీరుతామని, ఎవరైనా అటవీశాఖ ప్రణాళికకు అడ్డు తగిలినా, కోర్టులో కేసు వేసినా లక్ష రూపాయల జరిమానా విధిస్తారు' అని డిఎఫ్ఒ వివేక్ చెప్పారు. అలాగే యూనివర్సిటీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. తిరుపతి అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గతంలో కొంతమంది ఇదే స్థలంపై పట్టాలు పొందారని, అటు తరువాత అటవాశాఖ కోర్టును ఆశ్రయించి ఆ పట్టాలను రద్దు చేయించిందన్నారు. కేంద్ర పర్యావరణ అటవీ పరిరక్షణ విభాగం ఆదేశానుసారం మొక్కలుపెంచడం అనివార్యమని, మళ్లీ ఏదైనా ఇబ్బందులు కలిగిస్తే 144 సెక్షన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు శ్రీకాళహస్తి ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆహార అన్వేషణలో భాగంగా శేషాచలం అడవుల నుంచి చిరుతల సంచారం యూనివర్సిటీల పరిధిలో ఎక్కువయ్యిందని, పారిశుధ్యం మెరుగ్గా ఉంటే చిరుతలు రావన్నారు. తిరుపతి - చెర్లోపల్లి మార్గంలో గృహ నిర్మాణ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలను వేయకుండా కమిషనర్ మౌర్య శ్రద్ధ తీసుకున్నారన్నారు. టిటిడి కూడా తగిన సహకారాన్ని అందిస్తుందన్నారు. కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతంలో కుక్కలను పట్టుకుని వేరేచోటకు తరలించాలని సంబంధిత అధికారులకు లేఖలు రాశామన్నారు. అహర్నిశలు శ్రమించి చిరుతను బంధించడానికి కృషి చేసిన ఎఫ్ఆర్ఒ సుదర్శన్‌రెడ్డిని, 25 మంది అటవీ శాఖ సిబ్బందిని ప్రత్యేక అభినందించారు.

డిప్యూటీ సీఎంచే ఆవిష్కరణ.....

శేషాచలం అటవీ పరిధిలో అంతరించిపోతున్న జాబితాలో ఉన్న అరుదైన జీవిగా గుర్తింపు పొందిన (స్లెండర్ లోరీస్)దేవాంగ పిల్లి పరిరక్షణకు, వాటి సంతతి పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సంబంధించిన నివేదికను, ప్రణాళికను రాష్ట్ర డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మంగళవారం మంత్రి కార్యాలయంలో ఆవిష్కరిస్తారని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 441 దేవాంగ పిల్లులు ఉన్నట్లుగా ఇటీవల సీనియర్ ప్రైమేట్ రీసెర్చ్ ఎక్స్పర్ట్ డాక్టర్ ఆర్.శశి శేషాచలం అడవులలో అధ్యయనం చేశారన్నారు. ఈ నివేదిక ఆధారంగా దేవాంగ పిల్లల సంతతిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలానే శేషాచలం అడవులలో జరిగే పరిశోధనలకు సంబంధించి ప్రతి అంశం డిజిటలైజేషన్ చేయడానికి నిర్ణయించామన్నారు. ఐఐటి, జిల్లా అటవీ శాఖ సంయుక్తంగా శేషాచలం అడవులలో పక్షులు, సీతాకోక చిలుకలుపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఏనుగుల సంచారానికి సంబంధించి ఐదు కిలోమీటర్ల రేడియస్ ప్రాంత పరిధిలో నివసించే ప్రజలకు ఒక అప్రమత్తత మెసేజ్ ను ఆర్టిజిఎస్ టెక్నాలజీ ద్వారా పంపడానికి ప్రస్తుతం సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇది రాబోయే రోజుల్లో ఏనుగుల సంచారానికి సంబంధించి మానవాళికి ఏ విధమైన హాని జరగకుండా కాపాడే ప్రయత్నం అన్నారు.

వాహన తనిఖీల్లో 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా కరకంబాడీ-మామండూరు మార్గంలో ఆంజనేయపురం వద్ద వాహనాల తనిఖీల్లో 20 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లరును అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బందం సోమవారం రాత్రి నుంచి మామండూరు రోడ్డు మార్గంలో వాహన తనిఖీలు చేపట్టారని అధికారులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున రెండు కార్లు వేగంగా వస్తుండగా, అడ్డుపడి ఆపారని, ఒక వాహనంలోని డ్రైవర్ పారిపోగా మరో వ్యక్తిని పట్టుకున్నామన్నారు. వాహనాన్నీ తనిఖీ చేయగా అందులో 20 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. పట్టుబడిన స్మగ్లర్ కర్నాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

శ్రీసిటీని సందర్శించిన 'కొరియా రిపబ్లిక్' కాన్సుల్ జనరల్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. కొరియా ట్రేడ్-ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్రా) అధికారులు, కొరియన్ వ్యాపార ప్రతినిధుల బందంతో కలిసి విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. కాన్సుల్ జనరల్ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొరియా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు ఇది సహకరిస్తుందని వ్యాఖ్యానించారు.

ర్యాంపులు తొలగించి శుభ్రం చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో ఇండ్లు, దుకాణాల ముందు డ్రెయినేజీ కాలువలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లు తొలగించి కాలువలు శుభ్రం చేయించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు 32, 36 వార్డుల్లో కే.కె.లేఔట్, దొడ్డాపురం స్ట్రీట్, గిరిధర్ దాస్ లేన్, యాదవ వీధి, నిమ్మకాయల వీధి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, శైలజ, అధికారులతో కలసి పరిశీలించారు. కేజెక్స్ స్కూల్ సందులో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే శుభ్రం చేయాలని అన్నారు. అలాగే ప్రజల నుండి వచ్చిన వినతుల ఆయా విభాగాల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రాజు ఏసిపి మధు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

సర్వేయర్లను అడ్డుకున్న చింతలపాలెం రైతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తుడా సంస్థకు భూముల సేకరణ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులను మంగళవారం ఏర్పేడు మండలం చింతలపాలెం రైతులు అడ్డుకున్నారు. తుడా కోసం పచ్చని పొలాలను తాకట్టు పెట్టొద్దు అంటూ అక్కడి రైతులు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తున్న పరిస్థితి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా తాము ముందుకు పోయేది లేదని చెబుతూనే, చింతలపాలెంకు సర్వేయర్లను పంపడంతో అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. పొలాలను ఫోటోలు తీస్తుండగా రైతులు వెంబడించడంతో అక్కడి నుంచి కారులో ఉడాయించారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు నేరుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహశీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు.

మా భూములు తుడాకు ఇచ్చేది లేదని చెబుతున్నా మళ్లీ ఎందుకు దొంగచాటుగా సర్వేలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంకోసారి తమ పొలాల వైపు రావద్దని తేల్చిచెప్పారు.

ఏర్పేడు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ..

ఉపాధి కార్మికులను పెంచండి

ప్రజాశక్తి - రామచంద్రపురం : ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచి, పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామంలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. వర్షాలతో భూమి మెత్తబడడంతో ఉపాధి కార్మికులకు మంచి వేతనం లభిస్తుందన్నారు. ప్రతి ఉపాధి కార్మికుడికి రూ.307 రూపాయలు గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జాబ్ కార్డులో ఉపాధి కూలీల పని దినాలను, పొందిన వేతనం వివరాలను నమోదు చేయాలన్నారు. కూలీలకు రావాల్సిన వేతన బకాయిలను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, జేఈఈ భాగ్యలక్ష్మి, సాంకేతిక సహాయకులు గోపి, ఆరోక్య తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం18 నుండి 22వ తేదీ వరకు 5 నుండి 15 సంవత్సరాల పిల్లలకు వేయాలని వైద్యాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర రెడ్డిల ఆదేశాల మేరకు, మండలంలోని ప్రతి పాఠశాలలోనూ ఆరోగ్య సిబ్బంది టీకేలు వేయనున్నారు. మంగళవారం గాజుల పెళ్లూరు, యానాది కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశలు, అంగన్వాడీలు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

కరాటేలో వారాహి విద్యా వికాస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సొసైటీ ప్రాంతంలోని వారాహి విద్యా వికాస్ పాఠశాల విద్యార్థులు సిద్ధార్థ కరాటే-డు అకాడమీ ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోల్‌లోని డాక్టర్ పి.ఆనంద్ మినీ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ -2025 లో విద్యార్థులు ప్రతిభ చాటారు. మేధా సింగ్ - (1వ స్థానం-గోల్డ్ మెడల్), వరుణ్ సందేశ్ - (2వ స్థానం-సిల్వర్ మెడల్), శశాంక్ శ్రీసాయి (3వ స్థానం-కాంస్య పతకం), తనీష్ - (3వ స్థానం-కాంస్య పతకం) పతకాలను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్ శివ శంకర్‌ను పాఠశాల కరస్పాండెంట్ మౌనిష్, చైర్మన్ గుణవతి, ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ రావులు అభినందించారు.

ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సిఆర్ రెడ్డి కల్యాణ మండపంలో గూడూరు, శ్రీకాళహస్తి డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సూచించిన మేరకే మందులను విక్రయించాలన్నారు. గర్భస్రావ మందులు, కిట్లు విక్రయించ రాదన్నారు. అనంతరం ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్ రమేష్, రెండవ పట్టణ ఎస్ఐ షఫిహాన్, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తిన సుధాకర్, సెక్రటరీ సుభాన్, గూడూరు, చిల్లకూరు, చెన్నూరు, మెడికల్ షాప్ యజమానులు, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): పెన్షన్ల వెరిఫికేషన్‌లో భాగంగా మండలంలో కొంతమందికి పెన్షన్లు తొలగించారు. వీరిలో చాలామంది నిరుపేదలున్నారు. తొలగించిన పింఛన్లను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందేలా చూడాలని మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు, తొట్టంబేడు మండలం మాజీ జెడ్పీటీసీ అభ్యర్థి గాలి మురళి నాయుడు ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను కోరారు. అనంతరం పింఛన్ల రద్దు ప్రయాసతో మండల కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ వారి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - వరదయ్యపాళెం: మండల పరిధిలోని చిన్న పాండూరు కూడలిలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నిరుపాక దొరబాబు తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ వీలైనంత త్వరగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు.

పాఠశాలలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏర్పేడు : విద్యార్థులకు పరిశుభ్రమైన త్రాగునీటిని అందించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచన మేరకు పాగాలి ప్రాథమిక పాఠశాలలో రాక్ మెన్ పవర్ల ఫౌండేషన్ త్రాగునీటి ట్యాంకును ఏర్పాటు చేసి, విద్యార్థుల అవసరాలను తీర్చింది.

దయానందకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రమాదవశాత్తు జారి పడి ఇటీవల చికిత్స తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు బావమరిది దయానంద నాయుడుని మంగళవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట అంజూరు తారక శ్రీనివాసులు, కంఠా ఉదయ్ కుమార్, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్,బుల్లెట్ జయ శ్యామ్ తదితరులున్నారు.

బ్లాక్ డే జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మంగళవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు వెంకటగిరి ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో వెంకటగిరి ప్రాజెక్ట్ సిడిపిఓకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్ట్ అధ్యక్షులు మంజుల మాట్లాడుతూ అంగన్వాడీ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 21 వ తేదీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు కోసం, వేతనాల పెంపు కోసం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని పలు డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వెంకటగిరి ప్రాజెక్టు పరిధిలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి తదితర మండలాల్లో కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ, టీచర్ ఆయిలు హెల్పర్లు నిరసనలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాషిణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఒట్టు.. ఇది రోడ్డే

ఆందోళనలో గ్రామస్తులు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -ఏర్పేడు: గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు, గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని చెబుతుంటారు. దీంతో గ్రామాలలోని మౌలిక వసతి కల్పనకు ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పూనుకుంటాయి. అయితే గ్రామాల్లోని సమస్య తలెత్తినప్పుడు కొందరు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇందుకు నిదర్శనం ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు మాసాలుగా బండారుపల్లి, మిల్లి వీధిలో రోడ్డుపై వర్షపు నీరు ఎటు వెళ్లలేక అక్కడే నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాల బారిన పడుతున్నామని, మిగతా నడివీధి, కడ వీధుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులంతా కలిసి మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈఓపిఆర్డి రమణ కుమార్‌కి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తహశీల్దార్ భార్గవికి వినతి పత్రం అందించారు.

రెవెన్యూ అధికారుల సహాయంతో సమస్యను పరిష్కరిస్తాం..

మిల్లి వీధిలోని వర్షపు నీరు వెళ్లడానికి గతంలో డ్రైనేజీని నిర్మించారు. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు ప్రక్కనే ఉన్న తమ పొలంలోకి వీధిలోని వర్షపు నీరు వస్తుందని డ్రైన్ని పూడ్చి వేయడం జరిగింది. దీంతో సమస్య ఎదురయింది. ఇటీవల మోటార్ ద్వారా వర్షపు నీటిని తొలగించాం. కాని మరలా వర్షం రావడంతో యధావిధిగా నీరు నిల్వ ఉండిపోయింది. రెవెన్యూ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరిస్తాం.

- జె బాబు, పంచాయతీ కార్యదర్శి, బండారుపల్లి

సర్వేయర్‌ను పంపి పరిష్కరిస్తాం..

మండల సర్వేయర్ ద్వారా గ్రామంలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వర్షపు నీరు రోడ్లపై నిల్వ లేకుండా ప్రభుత్వ స్థలాల్లోకి వెళ్లే విధంగా చేస్తాం. మురుగు కాలువల నిర్వహణకూడా చేయిస్తాం.

- ఎం భార్గవి, ఎమ్మార్వో, ఏర్పేడు

వైసీపీ జెండాలతో తిరుమలకు..

■ అడ్డుకున్న పోలీసులు.. సొంత పూచీ కత్తుపై పదిమందికి అనుమతి

■ అనుమతి లేని 17 మంది అదుపులోకి

రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం : మద్యం స్కామ్‌లో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి ఆరోగ్యం కుదుటపడాలని, త్వరగా బెయిల్ మంజూరు కావాలని పీలేరుకు చెందిన వైసిపి నాయకులు డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది వైసీపీ జెండాలు, బ్యానర్లు, మిథున్ రెడ్డి జిందాబాద్, వైసీపీ జిందాబాద్ నినాదాలతో పాదయాత్రగా శ్రీవారి మెట్లు మార్గం నుండి తిరుమలకు వెళ్లేందుకు శ్రీనివాస మంగాపురం వద్దకు మంగళవారం చేరుకున్నారు. టిటిడి నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ జెండాలు పట్టుకుని తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న విషయం తెలుసుకున్న చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్చార్జి సీఐ హిమ్రాన్ ఖాన్, పోలీసులు మధ్యాహ్నం అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొంతసేపు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. డీఎస్పీ ప్రసాద్ పార్టీ జెండాలు, బ్యానర్లు లేకుండా, పదిమందిని మాత్రమే సొంత పూచీ కత్తితో తిరుమలకు శ్రీవారి మెట్లు మార్గం నడిచి వెళ్ళేందుకు అనుమతిచ్చారు. కానీ మరో 17 మంది పోలీసుల ఆదేశాలను అతిక్రమించి శ్రీవారి మెట్లు మార్గాన తిరుమలకు వెళుతుండగా చంద్రగిరి ఎస్సైలు రవీంద్ర నాయక్, అనితలు అదుపులో తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తిరుమలలో టిటిడి నిబంధనల మేరకు ఎలాంటి రాజకీయ పార్టీల జెండాలు, ప్రసంగాలు, నినాదాలు చేయకూడదని నిబంధన ఉన్నందున కేవలం పది మందిని మాత్రమే అనుమతించామని పోలీసులు తెలిపారు.

శాంతియుతంగా నిర్వహించే పాదయాత్రను అడ్డుకోవడం దారుణం : మురళీధర్

ప్రజాశక్తి - క్యాంపస్ : మిథున్ రెడ్డి అక్రమ అరెస్టైన విషయమై వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి. హరిప్రసాద్ రెడ్డి తమ అభిమాన నాయకుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి త్వరగా బెయిల్ రావాలనే ఆకాంక్షతో పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తుంటే అడ్డుకోవడం దారుణమనీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ హరిప్రసాద్ రెడ్డి పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్రలో కళ్యాణి డ్యామ్ క్రాస్ చేరుకోవడం జరిగిందన్నారు. శ్రీనివాస మంగాపురం చేరుకున్న యాత్రను టిటిడి విజిలెన్స్ వారు అడ్డగించారని ఆరోపించారు. కొండకు వెళ్తున్న భక్తులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కలియుగ దైవమే తగిన బుద్ధి చెప్తాడన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, కోటేశ్వరరావు, సుధాకర్ రెడ్డి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిపాలన భవనం ముట్టడి జయప్రదం చేయండి

■ ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి వినోద్ కుమార్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరిపాలన భవనం ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి వినోద్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా వర్సిటీలోని వివిధ విభాగాల్లో విద్యార్థులను నేరుగా కలుసుకుని, వర్సిటీ సమస్యలపై ప్రచురించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో మాట్లాడుతూ వర్సిటీలోని పరీక్షల విభాగం దిగజారిపోయిందని, కొంతమంది ఉద్యోగులు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే విద్యార్థుల దగ్గర లంచాలు అడుగుతున్నారని, రెండు నెలల క్రితం కొంతమంది ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినా, ఏ మాత్రం మార్పు రాలేదని, డిగ్రీ, పీజీ, లా విద్యార్థులు పరీక్షలు రాసి దాదాపు 8 నెలలు గడిచినా ఫలితాలు విడుదల కాలేదని, దీనివల్ల డిగ్రీలు పూర్తిచేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక అనేక ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో యూజీసీ నెట్, సెట్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకోసం శిక్షణ ఇవ్వాలని, వసతిగృహాలు అధ్వాన్నంగా ఉన్నాయని, మహిళా వసతిగృహాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని, మెస్సుల్లో భోజన నాణ్యత చాలా దారుణంగా ఉందని పేర్కొన్నారు. వర్సిటీలో అనేక ల్యాప్‌టాప్‌లు వాడకంలో లేక స్టోర్‌రూమ్‌లో మూలుగుతున్నాయని, వాటిని పరిశోధక విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే పోరాటంలో విద్యార్థులు అందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

దళితుడికి న్యాయం చేయండి

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: దళిత, గిరిజన, బహుజన, వామపక్ష, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఎమ్మార్పియస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పల్లిపాటి రవి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వివి రమణయ్యలు మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన పోలేరమ్మ జాతరలో కాంపాలెం, దళితవాడకు చెందిన లంకా చెంచు కుమార్‌పై పోలీసులు దాడి చేయగా, దళితుడు ప్రాణాపాయ స్థితిలోకి చేరుకున్నాడన్నారు. దళితుడికి న్యాయం చేయాలని ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలుపగా, అప్పటి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ, తహశీల్దారులు మధ్యస్థం చేసి దళితుడికి రెండు ఎకరాల భూమి, ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఆ హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. 25వ మహా ధర్నా వెంకటగిరిలో జరపాలని నిర్ణయించామన్నారు. పోలీసులపై ప్రైవేట్ కేసు వేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి దళితవాడకు జరిగిన అన్యాయాన్ని కరపత్రం రూపంలో పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాలు, గిరిజన సంఘాలు, వామపక్ష సంఘాలు, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా స్థలాలకు దారి చూపండి : ఎన్ఆర్ఐ సునీత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తాము విదేశాలలో కష్టపడి సంపాదించిన సొమ్ముతో తిరుపతి కైకాల చెరువు వద్ద ఫ్లాట్లు కొనుగోలు చేశామని, అయితే కొనుగోలు చేసిన ఫ్లాట్లకు దారి లేకుండా కంచి రాము అనే వ్యక్తి దౌర్జన్యంగా గోడలను నిర్మించాలని, జిల్లా అధికారులు స్పందించి తమ ఫ్లాట్లకు దారి చూపాలని ఎన్ఆర్ఐ డాక్టర్ సునీత కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో కంచి రాము అనే వ్యక్తి రెవెన్యూ రికార్డులలో లేని సర్వే నంబర్ 1/1బి ని పుట్టించి, నగరపాలక సంస్థ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ టిడిఆర్ బాండ్ ను పొందరన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ ను కోరగా ఆయన విచారించి ఫ్లాట్ల దారులకు న్యాయం జరిగేలా చర్య తీసుకున్నారన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రస్తుతం కంచి రాము వీ అక్రమ కట్టడాలని నిర్ధారించి తీర్పును మున్సిపాల్ కార్పొరేషన్ అధికారులకు పంపించిన ఇప్పటివరకు చర్యలు లేవన్నారు. తన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణ పాఠశాల బస్సు డ్రైవర్ ఓవర్ యాక్షన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు డ్రైవర్ ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో వీరంగం సృష్టించాడు. బస్సును అడ్డదిడ్డంగా నడిపి ట్రాఫిక్ జామ్ అవ్వడానికి కారణం అయ్యాడు. ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తున్నా అడ్డు తొలగకుండా మీదికి పోనిచ్చాడు. హెవీ వెహికల్ అయిన ఆర్టీసీ బస్సు వెనక్కి వెళ్లే పరిస్థితి లేదనీ, నువ్వే వెనక్కి వెళ్లాలని వారించినా వినలేదు. స్థానికులు, వాహనదారులు వచ్చి అభ్యర్థించినా, హెచ్చరించినా ఏమాత్రం ఖాతరు చేయకుండా అలాగే ఉండిపోయాడు. దీంతో ఆర్టీసీ కూడలిలో నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చివరకు ఆర్టీసీ డ్రైవర్ బస్సును వెనక్కి తీయడంతో సమస్య సద్దుమణిగింది. కనీసం రోడ్డు నిబంధనలను పట్టించుకోకుండా అతిచేసిన నారాయణ బస్సు డ్రైవర్ పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముక్కంటికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విజయవాడకు చెందిన బొమ్మరాజు రఘు%ఖు%ధరావు కుటుంబం మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏఈవో మోహన్ కు అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, నాయుడుపేటలో మంగళవారం 186వ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ధర్మయ్య, చిగురాకుల శివకుమార్, స్థానిక ఫోటో స్టూడియో యజమానులు, ఫోటోగ్రఫీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ మందిరం వద్ద నుండి ఫోటోగ్రాఫర్లు తమ ఐక్యతను చాటుతూ ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం. డిఎస్ఆర్ కళ్యాణమండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫోటోగ్రాఫర్స్ డే నిర్వహించారు. పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లకు సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ ఫోటోగ్రాఫర్లు వారి అనుభవాలను పంచుకుని నేటి తరం ఫోటోగ్రాఫర్లకు సూచనలిచ్చారు. సీనియర్ ఫోటోగ్రాఫర్ గూడూరు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేని, అధికారులను కలిసి వినతి పత్రం అందించి, ఫోటోగ్రాఫర్లకు పక్క ఇల్లు సాధించేందుకు తన వంతుకృషి చేస్తానని, అందరూ ఫోటోగ్రాఫర్లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ జీకే డిజిటల్స్ గూడూరు కిరణ్ కుమార్, శివ స్టూడియో రవి, స్టార్ స్టూడియో జి ఆర్ బాబు ,కుమార్ స్టూడియో రాహుల్,ఎస్ వి స్టూడియో గోపీనాథ్ రెడ్డి,సిరి ఫోటో స్టూడియో అనిల్, స్థానిక ఫోటో స్టూడియో యజమానులు,ఫోటో స్టూడియో కార్మికులు పాల్గొన్నారు.

తిరుపతిలో 99 స్టోర్ పై స్విగ్గీ భారీ పెట్టుబడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ ఆన్-డిమాండ్ సౌకర్య వ్యవస్థ స్విగ్గీ లిమిటెడ్ తిరుపతిలో 99 స్టోర్ ఆఫర్ పై భారీ పెట్టుబడి పెడుతున్నట్లు సమస్త బిజినెస్ చీఫ్ ఆఫీసర్ సిద్ధార్థ భకు తెలిపారు. మంగళవారం తిరుపతిలో విలేకరులతో మాట్లాడుతూ జులైలో ప్రారంభించిన ఫ్లాట్ రూ.99కి విస్తృత శ్రేణి వంటకాలను ఇకో సేవర్ విధానం ద్వారా ఉచితంగా డెలివరీ చేసే ఈ కొత్త ఆఫరింగ్ కోసం కస్టమర్ల నుండి అనూహ్యమైన స్పందన లభించిందన్నారు. తిరుపతి 99 స్టోర్ స్విగ్గీ సరసమైన ధర, ప్రామాణికతలను సమతుల్యం చేసే మెనూను రూపొందించడానికి స్థానిక రెస్టారెంట్ భాగస్వాములతో కలిసి పని చేస్తోందన్నారు. ఇది ప్రారంభమైన నాటి నుండి, తిరుపతిలో 99 స్టోర్ కి జనాల తాకిడి ఎక్కువైందని తెలిపారు. మంచి రుచులను రూ. 99 స్టోర్ కు తీసుకురావడానికి ద పారడైజ్, హాట్ స్పాట్, క్వాలిటీ స్పైసీ ఫ్యామిలీ రెస్టారెంట్ వంటి ప్రముఖ స్థానిక రెస్టారెంట్లు స్విగ్గీతో భాగస్వామం చేసామన్నారు. లంచ్ విరామాలు, కాలేజీ భోజనాలు, అర్ధరాత్రి తినాలని కోరుకునే వారి కోసం ఇది ప్రధానమైన వేదికగా నిలిచిందని తెలిపారు. ఈ సమావేశంలో ది పారిడైజ్ యజమాని జయశంకర్, క్వాలిటీ స్పైసి ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంలో దేశీయ గోవుల పాత్ర

■ పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి ప్రస్తావన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశీయ ఆవుల లభ్యతపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో సహజ పద్ధతులు పెరుగుతున్న వేళ, దేశీ ఆవుల కొరత రైతులకు పెద్ద అడ్డంకిగా మారిందన్నారు. దేశీ ఆవు జాతుల సంరక్షణ, అభివృద్ధి, పెంపకానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలపై సమాచారం కోరారు. అలాగే, రైతులకు దేశీ ఆవుల పెంపకం కోసం అందిస్తున్న ప్రోత్సాహకాలు, గత మూడు సంవత్సరాల్లో లబ్ధిదారుల వివరాలు, భవిష్యత్‌లో తీసుకోబోయే కొత్త కార్యక్రమాలపై స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీని పై కేంద్ర పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి ఎస్.పి.సింగ్ బాఘెల్ సమాధానమిస్తూ, దేశీయ ఆవుల సంరక్షణకు కేంద్రం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పలు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 2019 పశుగణన ప్రకారం, దేశంలో 193.46 మిలియన్ పశువులుండగా, వీటిలో 73.45 శాతం దేశీయ జాతులని చెప్పారు. గత మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 8.55 కోట్ల కృత్రిమ గర్భధారణలు నిర్వహించగా, 2.78 కోట్ల రైతులు లబ్ధి పొందారని తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 91.61 లక్షల కృత్రిమ గర్భధారణలు జరిగి, 18.52 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. ఆవుల నాణ్యత పెంపు కోసం లింగ క్రమబద్ధీకరించిన వీర్యం, ఐవిఎఫ్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారన్నారు. గుంటూరు, చింతలవెల్లి లాంటి ప్రాంతాల్లో ఐవిఎఫ్ కేంద్రాలు, గోకుల్ గ్రామాలు ఏర్పాటు చేశారన్నారు. దేశవ్యాప్తంగా 38,736 సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చారు. వీరిలో 4,746 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలన్నింటి ఉద్దేశ్యం దేశీయ ఆవుల రక్షణతో పాటు, సహజ వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం, రైతుల ఆదాయం పెంచడమేనని మంత్రి తెలిపారు. మంత్రి సమాధానంపై ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రాలతో సమన్వయం పెంచుకోవాలని, దేశీయ ఆవుల పెంపకాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. రైతుల ఆదాయం, సహజ వ్యవసాయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం న్యూస్

ఏటీఎం సెంటర్‌లో వైర్లు కట్ చేసిన వ్యక్తి

ప్రజాశక్తి - తిరుమల : తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఎటిఎం సెంటర్‌లో ఓ వ్యకత్తి వైర్లు కట్ చేశాడు. ఏటీఎంలో దూరి అక్కడి సీసీ కెమెరా వైర్లను కట్ చేసి పరారయ్యాడు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ వ్యక్తిని కమాండ్ కంట్రోల్లో విజిలెన్స్ సిబ్బంది కళ్యాణ వేదిక దగ్గర గుర్తించి పట్టుకున్నారు. అతని పేరు ప్రవీణ్ కుమార్ (36) తండ్రి పేరు నీలకంఠ ఆచారి అని, అతను తుంకూరు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసుల విచారణలో అతను కర్ణాటకలోని జెసిబి డ్రైవర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. అతనికి మతిస్థిమితం సరిగ్గా లేదని పోలీసులు తెలిపారు.

తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోజూ తాగొచ్చి గొడవ చేస్తుండగా భార్య మందలించడంతో, భర్త మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని వెలంపాడులో ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన పెంచలయ్య(55) మద్యానికి బానిస అయ్యాడు. రోజు తాగి వచ్చి ఇంట్లో గొడవ చేస్తుండడంతో భార్య, కుమారుడు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన పెచలయ్య ఈ నెల 16వ తేదీన మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆచార్య దేవపస్రాదరాజుకు పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవ ప్రసాద రాజు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. రేర్ ఎర్త్ రంగం లో చేసిన పరిశోధనా కృషికి గుర్తింపుగా రేర్ ఎర్త్ అసోసియేషన్ ఈ పురస్కారాన్ని అందజేసింది. భువనేశ్వర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వికె సారస్వత్ చేతుల మీదుగా ఆచార్య దేవప్రసాదరాజు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 16 యేళ్లుగా ఆయన చేసిన పరిశోధనలకు 5 జాతీయ, 3 అంతర్జాతీయ సదస్సులు, పరిశోధనా ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ఆయన రూపొందించిన 125 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 13 మంది పిహెచ్‌డి విద్యార్థులకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. రేర్ ఎర్త్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, ఎస్వీయూ రిట్కెర్డు ప్రొఫెసర్ సీకే జయశంకర్, ఎస్వీయు సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. పద్మావతి ఆయనను అభినందించారు.

శ్రీకాళహస్తిలో బార్లకు నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీ ప్రభుత్వ నూతన బార్ పాలసీ మేరకు శ్రీకాళహస్తిలో 4 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఎక్సైజ్ శాఖ అధికారిణి లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరీలో 3, గౌడ కమ్యూనిటీకి ఓ బార్ కేటాయిస్తామని చెప్పారు. జనరల్ బార్‌కు రూ. 55 లక్షలు, గౌడ కమ్యూనిటీ బార్ కు రూ.27.50 లక్షల లైసెన్స్ ఫీజు ఏడాది గడువులోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్లైన్, ఆఫ్లైన్, హైబ్రిడ్ పద్ధతుల్లో అప్లై చేసుకోవచ్చని సూచించారు.

పుత్తూరులో డామినేషన్ డే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో శాంతి, భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడం, ప్రజల్లో భద్రతాభావం కల్పించ డమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డామినేషన్ డే కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ సర్కిల్ నుండి ప్రారంభించి తిరుపతి రోడ్డు, పుత్తూరు పట్టణ పురవీధులలో పోలీసులు బలంగా మోహరించారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, రద్దీ వీధుల్లో వాహన తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ డామినేషన్ డే నిర్వహ ణ ద్వారా నేరస్తులకు భయం కలుగుతుందన్నారు. ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుందని తెలిపారు. అక్రమాలు, గూండాగిరి, గంజాయి, మద్యం రవాణా వంటి కార్యకలాపాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రెడ్డి శేఖర్, ఎస్సై ఓబయ్య, ఎస్సై పొన్నుస్వామి, కే భాస్కర్, సహా భారీగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు పోలీస్ స్టేషన్‌ను గూడూర్ డిఎస్పి గీతాకుమారి మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను ఆరాతీశారు. ఫిర్యాదుదారులను నిర్లక్ష్యం చేయవద్దని, ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట సీఐ హుస్సేన్ భాష, ఎస్సై నాగబాబులున్నారు.

గంగన్న పాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి - వాకాడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ-సర్వే ప్రాజెక్టులో భాగంగా తిరుపతి జిల్లాలో ఫస్ట్ ఫేస్ నుండి వాకాడు మండలం గంగనపాలెంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే పూర్తయినందున తిరుపతి జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం డిఎల్ఆర్ కంప్యూటర్ నందన ఆర్ఓఆర్ ఫైనల్ పబ్లికేషన్ గ్రామస్తులకు చదివి వినిపించి, ఏదైనా అభ్యంతరం ఉంటే 15 రోజుల్లోగా తెలుపాలని, గ్రామ సచివాలయంలో పబ్లికేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రఫీసయ్యద్, ఆర్ఐ అఖిల్, మండల సర్వేయర్ శకుంతల మరియు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

In the Court of the Principal civil Judge (Senior Division): Tirupati
I.A.No.229/2025, O.S.No.147/2022
Gundlapalli Reddy Prasad ..Petitioner/Plaintiff
Vs.
C.V.Manjunatha ..Respondent/Defendant
U/o 34 Rule 3(2) & 151 CPC Final Decree
పిటీషనర్ నందు రెస్పాండెంట్‌కు నోటీసులు
C.V.Manjulatha S/o C.Venkatramana,Flat No.202, Sruthi Apartments, Venkataramana Layout, Grand World Road, Tirupati Town & Post, Urban Mandal & District.
Cell: 9392761151, 9715646981
పై దావాను 07.03.2020 తేదీన రిజిష్టర్ మార్టిగేజ్ పైకము రాబట్టు కొనుటకు గాను దావా వేసియున్నారు. సదరు దావా తేదీ. 24.11.2023న ప్రిలిమనరి డిక్రీ ఇచ్చియున్నారు. సదరు ప్రిలిమనరి డిక్రీ ప్రకారము సదరు ఐ.ఎ.నెం.229/2025ను ఫైనల్ డిక్రీ కొరకు వేసియున్నారు. సదరు ఐ.ఎ. నందు రెస్పాండెంట్ అయిన నీవు ఎందుకు ఫైనల్ డిక్రీ ఇవ్వకూడదో తెలియ చెప్పుటకు గాను తేదీ. **16.09.2025**న వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గంllలకు నేరులో గానీ లేక వకీలు ద్వారా హాజరై నీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేదీ. 16.09.2025
కటారి కోటేశ్వర రెడ్డి
వాది/పిటీషనర్ తరపు న్యాయవాది, తిరుపతి
సెల్ : 9573166799

మహిళా వర్సిటీలో ఇండక్షన్ కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ లోని స్కూల్ అఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో బి.టెక్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ పొందిన నూతన విద్యార్థులకు మంగళవారం ఓరియెంటేషన్, ఇండక్షన్ కార్యక్రమం ప్లేసెమెంట్, ట్రైనింగ్ సెల్ ఆధ్వర్యంలో 'కౌటిల్య ఇన్స్టిట్యూషన్' కంపెనీచే ఎంప్లోయబిలిటీ (ఉద్యోగ సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలు అనే అంశంపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి శిక్షకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.టెక్ విద్యార్థులు ఈ నాలుగు సంవత్సరాల అకడమిక్ విద్య మీ కెరీర్‌లో చాలా విలువైనదని, చదువుతో పాటు, పరిశ్రమ నైపుణ్యాలు అలవర్చుకోవాలన్నారు. నేడు కృత్రిమ మేధ, చాట్ జి.పి.టి, డేటా సైన్స్ యుగం నడుస్తోంది, ఇలాంటి తరుణంలో మీరు దృష్టి పెట్టాల్సిన నైపుణ్యాలు - తార్కిక ఆలోచన (లాజిక్) తో కూడిన పరిజ్ఞానం అవసరమన్నారు. కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు అరథమెటిక్, రీజనింగ్ , ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జి సబ్జెక్ట్‌తో ఒకటే కామన్ సిలబస్ వున్నందున, ఖాళీ సమయంలో అకడమిక్ చదువుతో పాటు, ప్రభుత్వ పోటీ పరీక్షలకు కూడా లక్ష్యం పెట్టొకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేసెమెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి.కిషోరీ, కో-ఆర్డినేటర్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరంబాడి రచనలు అందించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:శంకరంబాడి సుందరాచార్య సాహిత్యాన్ని సేకరించి, ప్రచురించిన శంకరంబాడి సాహిత్య పీఠం తిరుపతి వ్యవస్థాపకురాలు మస్తానమ్మ శంకరంబాడి సాహిత్యం ముద్రిత రూపంలో గానీ, రాత రూపంలో గానీ, ఎవరి వద్దఉన్నా అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె సుందరాచారి ముద్రిత రచనలను ప్రకటించారు. సుందరాచారి ముద్రిత రచనలు :వచన రచనలు:నేటి కవిత్వము, సంగ్రహ సుందర భారతము,ఏకలవ్యుడు,కళాపూర్ణోదయం, కావ్యములు..కెరటాలు (ఖండకావ్య సంపుటి),సుందర సుధాబిందువులు (ఖండ కావ్య సంపుటి), బుద్ధగీత, అపవాదు, పేదకవి,ఏకలవ్యుడు,కాంచీ వరదరాజావతరణము,జపమాల (గేయ సంపుటి), శాంతి దూతలు (బుద్ధుడు, గాంధీలపై బుర్రకథలు) స్వప్న సుందరుడు (ఉషా పరిణయ గీతకావ్యము),గీతాంజలి.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగాల సహకారంతో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో " ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును దొరవారిసత్రం, బీసీ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజి మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుజీవనరావు, లెక్చరర్ కస్తూరి బాబు, ఓ.ఆర్.డబ్ల్యూ ఐశ్వర్య , ఎ.యన్.యమ్-శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: మండలంలోని హెచ్ డబ్ల్యు అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తలకు మంగళవారం బాల్య వివాహాలపై ఐసిడిఎస్ సిడిపిఓ దేవకుమారి అవగాహన కల్పించారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహం చేయడం శ్రేయస్కరమని తెలిపారు. చిన్న వయసులో వివాహం జరిపితే ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా పగతి ట్రస్ట్ మండల కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎస్ జ్యోతి, వేణుగోపాల్, చెంచురామిరెడ్డి, ఈశ్వరయ్య ఓంకార్ పాల్గొన్నారు.

62వ రోజూ నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:రామారావుని బదిలీ చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 62వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావుపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య సుబ్రహ్మణ్యం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కామాక్షి సదాశివేశ్వరాలయ

పాలకమండలి తొలి సమావేశంపై భక్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :శ్రీకామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరాలయ పాలకమండలి తొలి సమావేశం మంగళవారం జరిగినప్పటికీ, ఆలయానికి విచ్చేసే భక్తుల అసలు సమస్యలపై ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రత్యేకంగా ఆలయంలో ఏర్పాటు చేసిన నవగ్రహాల వద్ద అభిషేకం చేసే పవిత్ర జలానికి సరైన డ్రైనేజీ లేకపోవడంతో, ఆ నీటిని భక్తులే తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. దీని వలన "గ్రహదోషం కలుగుతుంది" అన్న భయంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కీలక సమస్యపై ఈవో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం భక్తుల్లో నిరాశ కలిగిస్తోంది. అలాగే ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన 'ప్రమాణ స్వీకార బోర్డులు' పవిత్రతకు విరుద్ధమని, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే చర్యగా భావిస్తున్నారు. పండగ, కార్తిక మాసాల పర్వదినాల్లో వేలాది మంది మహిళలు ఆలయానికి తరలి వచ్చినా, కనీస బాత్రూం సౌకర్యాలు కూడా లేకపోవడం ఆలయ పరిపాలనలో నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. అయితే మరోవైపు ఆఫీస్ నిర్మాణం, అకౌంట్స్ క్లర్క్ నియామకానికి మాత్రమే నిధులు సమకూర్చుకోవడం పాలకమండలి తీరుపై ప్రశ్నార్థకంగా మారింది. భక్తులు ప్రశ్నిస్తూ అసలు ఈవోకు ఆలయ ఆస్తిపాస్తులపై పూర్తి అవగాహన ఉందా? ఆలయ విశిష్టత, చరిత్ర గురించి తెలుసా? ఈవో విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా, లేక కేవలం పర్యవేక్షణలోనే పరిమితమైపోతున్నారా? ఇక కోదండరామాలయం అర్చకులకు జీతభత్యాలు క్రమంగా చెల్లించడం లేదన్న వదంతులు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. "అర్చకులకు తగిన గౌరవం ఇవ్వకపోతే, ఆలయ నిధులను ఎక్కడ వినియోగిస్తున్నారు?" అన్న ప్రశ్నలు ప్రజలలో వినిపిస్తున్నాయి. అదే సమయంలో, శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర ఆలయ ధ్వజస్తంభం

పూతరేకులు సరిగా అమర్చకపోవడంతో వర్షాకాలంలో నీరు కిందికి వస్తున్నా ఈవో గానీ, పాలకమండలి సభ్యులు గానీ గుర్తించలేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని భక్తులు విమర్శిస్తున్నారు.మరొకవైపు, మహిళా సభ్యులు హాజరుకావాల్సిన పాలక మండలి సమావేశాలకు వారి భర్తలే హాజరవడం ఎంత మాత్రం సమంజసం? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఆలయం చుట్టూ నివసిస్తున్న కుటుంబాల ఇండ్లను కూల్చివేసి, అలాగే వదిలేయడం కూడా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దీనిపై ఈవో గానీ, పాలకమండలి గానీ ఎటువంటి నిర్ణయం తీసుకోవడంలేదు. మొత్తంగా, ఆలయ పాలకమండలి తొలి సమావేశం భక్తుల్లో విశ్వాసం నింపకుండా, మరిన్ని ప్రశ్నలకు తావిచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి -ఏర్పేడు: వినాయక విగ్రహాల ఏర్పాటుకు గ్రామస్తులు, కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని సీఐ బి.శ్రీకాంత్ రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ప్రతి విగ్రహానికి నంబర్ కేటాయిస్తామని, భద్రతా ఏర్పాట్లు ఆయా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతీ తీసుకోవాలని, తిరుపతి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆర్ సి పురం సబ్ ఇన్స్పెక్టర్ మురళీమోహన్ తెలిపారు. పోలీస్ స్టేషన్లో మంగళవారం నూతన ఇన్చార్జి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చవితి సంబరాలలో డీజేలకు అనుమతి లేదని తెలిపారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసుల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వినాయక చవితి సందర్భంగా మండపాలు, విగ్రహాలు ఏర్పాటుకు పోలీసులు అనుమతులు తప్పనిసరని శ్రీకాళహస్తి డీఎస్పీ కే.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే వారు శ్రీకాళహస్తి ఆర్డిఓ ద్వారా సింగల్ విండో విధానంలో అనుమతులు తీసుకోవాలన్నారు. కమిటీ వివరాలు, ఏప్రాంతంలో ఏర్పాటుచేస్తున్నారు, చిరునామా, పోలీసు స్టేషన్ పరిధి, విగ్రహానికి సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు. నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఎప్పుడు చేస్తారు, ఎప్పుడు తీసుకెళతారు అనేది కూడా దరఖాస్తులో పూర్తిచేయాలని తెలిపారు.

ఇస్కాన్ పోటీలలో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నిర్వహించినటువంటి వివిధ పోటీలలో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు ప్రతిభను కనబరిచారు. భగవద్గీత ఉపనిషత్తుల సారమని నిత్య దైనందిన జీవితంలో శ్రవణ, పఠణ, పాఠణ,మనన, ధారణాధుల ద్వారా సేవింపవలెనని తద్వారా ఏకాగ్రత అలబడుతుందని తెలిపారు. తెలుగులో మాట్లాడడం పోటీలలో డి.సుకృత-2వ బహుమతి, ఆర్.కృష్ణవేణి-2వ బహుమతి, ఎ. జ్ఞాన శ్రీ - 3వ బహుమతి, వై.గంగ భవాని (కాన్ సోలేషన్ బహుమతి, కె.శరణ్య - కాన్ సోలేషన్ బహుమతి, డ్రాయింగ్ పోటీలలో బి. శాంతి - 3వ బహుమతి, ఇంగ్లీష్ వ్యాసరచన లలో డి.తేజ సిరిచందన - 2వ బహుమతి, డిబేట్ పోటీలలో బి.అనిత - 3వ బహుమతి, ఎన్.కీర్తన - కాన్ సొలేషన్ బహుమతి, తెలుగు వ్యాసరచన పోటీలలో వి.దేవిక - 1వ బహుమతి, ఎస్.ఇందు -3వ బహుమతి, ఎమ్. కావ్య కాన్ సోలేషన్ బహుమతి, వై.రమ్యశ్రీ లను కళాశాల ప్రిన్సిపల్ డా.సి. భువనేశ్వరి, భవాని ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

ఆరేటమ్మ సేవలో మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ పరిధిలోని గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన పాలాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్.కే. రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి, సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన ఆగమ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండురోజులు జరిగిన ఆగమ సదస్సు మంగళవారంతో ముగి సింది. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య రజనీకాంత్ శుక్ల ముఖ్యాతిథులుగా హాజరై మాట్లాడుతూ ఆగమశాస్త్ర అధ్యయనం కర్తవ్యమని, ఆగమగ్రన్థాల ముద్రణ, పరిశోధన సదస్సుల నిర్వహణ విశ్వవిద్యాలయ బాధ్యతన్నా రు. అందుకు అనుక్షణం విద్యాపీఠం కృషిచేస్తున్నదని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతినిధులకు యోగ్యతా పత్రాలు ప్రదానం చేశారు. ఈ సదస్సులో చెన్నై నుండి విచ్చేసిన ఉరగడం లక్ష్మీనరసింహం డా.చావలి పవన్, వంశీ, శైలజా, ఉమామహేశ్వరి తదితరు లు ఆయా ఆగమాలపై పత్రసమర్పణ చేశారు. ఈ కార్య క్రమంలో సదస్సు కన్వీనర్ దర్శన సంకాయ ప్రముఖులు ఆగమ విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ వేదాన్తం శ్రీవిష్ణుభట్టాచా ర్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:పట్టణంలోని భరద్వాజ తీర్థంలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. 40 మంది విద్యార్థులకు చెస్, క్యారం బోర్డ్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ప్రముఖ న్యాయవాది, సంస్థ సభ్యులు గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాషా, బాబా ఫరీద్, నెల్లూరు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీర్పాకోట, గాజుల పెళ్లూరు, పార్లపల్లి గ్రామలలో మంగళవారం ఉదయం అగ్రికల్చర్ అధికారి షణ్ముగం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు డ్రం సీడ్ పద్ధతిలో వరి నాట్లు వేసి ఉన్నారు. ఈ పొలాల్లో కలుపు నివారణకు సంబంధించి కౌన్సిల్ ఆక్ట్ లాంటి వీడి సైడ్స్ రైతులకు రెకమెండ్ చేసి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఈ కేవైసీ పెండింగ్ ఉన్న రైతులకు తర్వగా పూర్తి చేయాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ వర్తించనివారు ఈరోజు ఈకేవైసీ చేసుకొని వివరాలు తెలియజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, ఇప్పుడు సెలూన్ షాపుల్లో 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లు ఉచిత సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, గతంలో ఆదరణ పథకం ద్వారా నాయి బ్రాహ్మణులకు లోన్లు, పనిముట్లు ఇవ్వడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద మంగళవారం నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల గురుస్వామి, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, రాజా, గురుమూర్తి, గోపాల్, ప్రతాప్, ప్రసాద్, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరాజు, రహీం తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలతో కంపు.. కంపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, తిరుపతి-చెన్నై హైవేలో పిల్లారుపట్టు వెళ్లే మార్గంలో చికెన్ సెంటర్ వ్యర్థాలను నేరుగా రోడ్డుపై వదులుతుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. రోడ్డుపై వ్యర్థాలు పేరుకుపోవడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారడమే కాక, దుర్వాసనతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కాలుష్య, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ సెంటర్ యజమాని నిర్లక్ష్యం వహిస్తుండగా, సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వ్యర్థాలను పైపుల ద్వారా కాలువల్లోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తామని హెచ్చరించారు.